క్లుప్తంగా

రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి

సంతబొమ్మాళి: తనకు రక్షణ కల్పించాలని కాపుగోదాయవలస గ్రామానికి చెందిన సైనా ఆదినారాయణ కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డికి సోమవారం గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. సర్వేనంబర్ 207–7లో 22 సెంట్లు భూమి వారసత్వంగా సంక్రమించిందన్నారు. అయితే ఆ ఆస్తిని గ్రామానికి చెందిన బన్నాడ వీరాస్వామి, సింహాచలం, వరహాలు, అంగ శంకర్‌రావు, రాజారావు ఆక్రమించుకున్నారని అన్నారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో భూమిని తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించగా ఆక్రమించుకున్న వ్యక్తులు దౌర్జన్యంగా తనపై దాడి చేసి, భూమి మీదకు వస్తే చంపేస్తా అంటూ బెదిరిస్తున్నారని ఆదినారాయణ వాపోయారు. రక్షణ కల్పించి తన భూమిని ఇప్పించాలని ఎస్పీని వేడుకున్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారులు

మందస: బైరిసారంగిపురం గ్రామంలోని ప్రభుత్వ క్రీడా మైదానంలో సోమవారం నుంచి బైరెమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంటు ఉత్సాహంగా ప్రారంభమైంది. 15 రోజులు జరగనున్న టోర్నమెంట్‌లో 40 జట్లు తలపడుతున్నాయి. మొదటి బహుమతిగా రూ. 15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. పదివేలు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బైరసారంగిపురం పెద్దలు, యువత ఆధ్వర్యంలో టోర్నమెంటు జరుగుతుంది.

అమ్మవారికి ఎమ్మెల్సీ పూజలు



ఉత్సావాల్లో ఎమ్మెల్సీ రామారావు తదితరులు

సోంపేట: కొర్లాం పంచాయతీ హుకుంపేట గ్రామంలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి, నీలమ్మ తల్లి గ్రామ దేవతల ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, బతకల మోహనరావు, బంగారు పాపారావు, మోహన్, గోకర్ల ధర్మారావు పాల్గొన్నారు.

భగవద్గీత పరీక్షలో రోజారాణి ప్రతిభ



బంగారు పతకం అందుకుంటున్న రోజారాణి

సంతబొమ్మాళి: మర్రిపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అట్టాడ వెంకటరమణ సతీమణి రోజారాణి ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత పోటీ పరీక్షలో బంగారు పతకం సాధించారు. మైసూర్ శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రయం అవధూత దత్తా పీఠం నిర్వహించిన భగవద్గీత పరీక్షలో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా సోమవారం గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు.

సచివాలయం వద్ద పడిగాపులు!



ధర్మపురం సచివాలయం వద్ద ప్రజలు

ఇచ్ఛాపురం రూరల్: గత ప్రభుత్వ హయాంలో స్వగ్రామంలోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించే గ్రామ సచివాలయాలు కూటమి ప్రభుత్వంలో పడకేశాయి. సిబ్బంది లేమితో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తులసిగాం గ్రామ సచివాలయంలో పది మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం గ్రామ సర్వేయర్, వీఆర్వో మాత్రమే ఉండటంతో భూములకు ఆధార్ లింక్, రేషన్ కార్డుల కోసం పక్కనున్న ధర్మపురం గ్రామ సచివాలయానికి వెళ్లాల్సి వస్తుంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వృద్ధులు, పిల్లలు, బాలింతలు అక్కడ పడిగాపులు కాశారు.

వైభవంగా సావిత్రి వ్రతాలు



బొరివంక రామేశ్వర ఆలయంలో సావిత్రి వ్రతాల్లో మహిళలు

కవిటి: భర్తలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ సావిత్రి అమావాస్య వ్రతాలను మహిళలు సోమవారం సంప్రదాయబద్ధంగా చేశారు. ఈ సీజన్‌లో పండే పనస, నేలపనస, తాటిముంజలు, ఈత, మామిడి, అరటిపండ్లను నైవేద్యంగా సమర్పించారు.

వేతనదారుల ఆకలి కేకలు!



మందసలోని లింగాల చెరువులో పని చేస్తున్న వేతనదారులు

- సకాలంలో చెల్లించని 'ఉపాధి'బిల్లులు
- డబ్బుల కోసం ఎదురు చూస్తున్న వైనం
- పని చేస్తున్న చోటు కనీస సాకర్యాలు సైతం శూన్యం

మందస:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారులు ఆకలి కేకలు పెడుతున్నారు. సుమారు ఏడు వారాలు చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేస్తున్న చోట కనీస మౌలిక సదుపాయాలు లేనప్పటికీ ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ పనులు చేస్తున్నప్పటికీ సకాలంలో బిల్లులు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా నెట్టుకు వస్తామని ప్రశ్నిస్తున్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారుకు సంవత్సరంలో కనీసం వంద రోజులు పని కల్పించాల్సి ఉంది. అయితే చాలా గ్రామాల్లో ఈ పరిస్థితి లేదు. అరకొర పనులు కల్పిస్తున్నారు. అయితే చేస్తున్న పని దినాలకు కూడా వారాల తరబడి వేతనం చెల్లించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలో సుమారు ఏడువేల మంది ఉపాధి వేతనదారులు వివిధ అభివృద్ధి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. చెరువు పనులు, కాలువ తవ్వకాలు చేస్తున్నారు. ఒక్క మండల కేంద్రం మందసలోనే సుమారు ఐదు వందల మంది పనులు చేస్తున్నారు. వీరిలో చాలామంది ఉపాధి పనులపైనే జీవనం సాగిస్తున్నారు. రోజు పనులకు వెళ్తున్నప్పటికీ కనీస వేతనం గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. చేస్తున్న పనికి కూడా వారాల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే పని చేసేచోట విశ్రాంతి తీసుకోవడానికి టెంటుగాని, ప్రథమ చికిత్స కోసం మందులు, తాగేందుకు మంచినీరు కూడా లేనప్పటికీ పట్టించుకోకుండా పనులు చేస్తున్నామని వేతనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేసిన పనులకు వెంటవెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి



రెండు నెలలుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించ లేదు. ఉపాధి పనులపైనే ఆధారపడి జీవిస్తున్నాం. వీలైనంతా వేగంగా అకౌంట్లలో డబ్బులను జమ చేస్తారని కోరుతన్నాం. పనికి తగ్గట్టుగా వేతనాలను కూడా పెంచాలి. పనిచేసే చోట మంచినీటి సౌకర్యం కల్పించాలి.
–కొవ్వూరు మంగమ్మ, వేతనదారు, మందస

మౌలిక సదుపాయాల్లేవు..



పని చేస్తున్న చోట కనీస మౌలిక సదుపాయాల్లేవు. పనిచేసే సమయంలో ఏదైన దెబ్బతగిలితే ప్రథమ చికిత్స చేయడానికి అవసరమయ్యే మందులు కూడా ఉండడం లేదు. ఎండ, వాన నుంచి రక్షణకు పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలి. చేసిన పనికి సకాలంలో బిల్లులు చెల్లించాలి.
–జి.సోమేష్, ఉపాధి వేతనదారు, మందస

వేతనాలు జమ కాకపోవడం వాస్తవమే..



ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు కొన్ని రోజులుగా వేతనాలు జమ కాకపోవడం వాస్తవమే. ఏప్రిల్ నెల వరకూ చెల్లింపులు చేశాం. మే నెలకు సంబంధించి పెండింగ్ ఉన్నాయి. త్వరలోనే వేతనదారుల ఖాతాలకు డబ్బులు జమచేసే ఏర్పాటు చేస్తున్నాం.
–హరికృష్ణ, ఉపాధి హామీ పథకం ఏపీవో, మందస

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మందస గ్రామదేవత అన్నపూర్ణమ్మ తల్లి ఆలయ 15వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. గ్రామదేవతకు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భవానీ సన్నిధానం ఆధ్వర్యంలో హోమం కార్యక్రమం చేపట్టారు. దేవరవీధి నుంచి మార్కెట్ రోడ్, బస్టాండ్, శాసనంవీధి మీదగా మహిళలు ముర్రాటలు పట్టుకుని గ్రామ దేవత ఆలయానికి చేరుకొని అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. – మందస

హైవేపై నీటి నిల్వలు..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలోని జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోయి ప్రమాదకరంగా మారింది. మొగిలిపాడు, కంబిరిగాం, లక్ష్మీపురం, బెండిగేటు, కోసంగిపురం, మకరజోల వంతెన కింద నీరు నిలిచిపోయింది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నీటిని తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. –కాశీబుగ్గ

ఆర్మీ జవాన్ కుటుంబానికి పరామర్శ



నందిగాం మండలం పెంటూరుకు చెందిన ఆర్మీ జవాన్ పిన్నింటి దొరబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ సోమవారం పరామర్శించారు. దొరబాబు చిత్రపటానికి నివాళులర్పించి..కుటుంబానికి తన సంతాపం తెలియజేశారు. జవాన్ కుమారులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. దిమిలాడకు చెందిన అట్టాడ జగన్నాథరావు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, చిన్నారి గోకర్లపల్లికి చెందిన రట్టి మురళీ మృతి చెండటంతో ఆకుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రథ జనబొడ్డపాడుకు చెందిన బుడ్డ దశరథ కుటుంబాన్ని పరామర్శించారు. దేవళభద్రకు చెందిన బొడ్డ కేశవరావు ప్రమాదానికి గురి కావడంతో ఆయనను కలిసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, జడ్యాడ జయరాం, సర్లాన బైరాగి, బొంగి హనుమంతురావు, తదితరులు ఉన్నారు. –నందిగాం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నందిగాం: మాట్లాడుతున్న సత్యన్నారాయణ



సోంపేట: యోగా శిక్షణలో ఉద్యోగులు



ఇచ్ఛాపురం టౌన్: యోగా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇచ్ఛాపురం టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పతాంజలి యోగా గురువు కె.సంజీవరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి నెల రోజుల పాటు జరిగే యోగా మాసోత్సవాల సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం యోగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వెంకటరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కె.రామారావు, డీటీ శ్రీహరి, ఆయుర్వేద వైద్యులు ప్రేమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: రోజూ యోగా చేయడం వలన మెరుగైన ఆరోగ్యం సాధ్యమని తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాన్ని కార్యాలయంలో నిర్వహించారు. యోగా గురువు కాశి సూర్యనారాయణ శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ, డీటీ మహేష్, సర్వేయర్ నాగేశ్వరరావు, ఏపీవో ప్రమీల, ఏపీఎం రమణమ్మ, ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

నందిగాం: యోగా అవశ్యకతను తెలిపి ప్రతిఒక్కరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో డి.సత్యన్నారాయణ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి యోగా ప్రాముఖ్యతను తెలియజేసి యోగాలో పాల్గొనేలా చూడాలని, ఆసక్తి ఉన్నవారి పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఎంపీడీవో కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో ఇక్కట్లు!

టెక్కలి రూరల్: కొద్ది రోజులుగా విద్యుత్ కోతతో ఇక్కట్లు పడుతున్నామని స్థానిక అయ్యప్పనగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో సరఫరా నిలిపివేసి మరుసటిరోజు ఉదయం ఇస్తుండడంతో నిద్రలేక, దోమలతో వేగలేక అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. నాణ్యమైన విద్యుత్ అందిస్తామని పాలకులు చెబుతున్న మాటలు ఇక్కడ అమలు కావడం లేదని కాలనీ వాసులు పెదవి విరుస్తున్నారు. సంబంధిత అధికా రులు స్పందించి అయ్యప్పనగర్‌లో విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



ఎల్‌సీ గేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద సోమవారం ట్రాఫిక్ నిలిచిపోయింది. రైలు గేటు వేయడంతో పాటు పట్టాల కింద ఉన్న పాత పట్టాలను లారీలలో తరలించే పనులు చేపట్టారు. దీంతో వాహనాల రాకపోలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాశీబుగ్గ, చినబడం రెండు వైపులా కిలోమీటరు వరకు ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందికరంగా మారింది.

జంగిల్ క్లియరెన్స్ చేశారు



పాతటెక్కలి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పొదలు, తీగలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...



సుంకరజగన్నాథపురం వద్ద పచ్చిక తీగలు తొలగించిన తరువాత 11కేవీ విద్యుత్ స్తంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాతటెక్కలి, సుంకరజగాన్నథపురం గ్రామాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, 11 కేవీ విద్యుత్ లైన్లకు తీగలు అల్లుకున్నాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తేది. ఈ సమస్యపై 'టెర్రర్ పుట్టిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌లు!' శీర్షికతో సాక్షిలో సోమవారం కథనం వచ్చింది. దీనికి వజ్రపుకొత్తూరు విద్యుత్ శాఖ ఏఈఈ జి.రమణ స్పందించారు. సిబ్బందితో కలిసి తీగలను తొగలించి.. జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైంది.

తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న లారీని పొక్లయినర్‌తో తొలగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి 16వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కంచిలికి చెందిన లారీ భద్రాచల్ నుంచి పేపర్ షీట్లను ఇచ్ఛాపురం తీసుకు వస్తుండగా లొద్దపుట్టి వద్ద రోడ్డు పనులు కోసం నిలిపి ఉన్న సెఫ్టీ వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, సెఫ్టీ వాహనం వెనుక భాగం దెబ్బతింది. దీంతో సుమారు రెండు గంటలు ట్రాఫిక్ నిలిచిపోయింది. హైవే సిబ్బంది చేరుకొని వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా మళ్లించారు. దెబ్బతిన్న లారీని పొక్లయినర్‌తో రోడ్డు పక్కకు తొలగించారు. ప్రమాదంపై సెఫ్టీ వాహనం డ్రైవర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భక్తి శ్రద్ధలతో జలయాత్ర



జలయాత్రలో మహిళలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని గొల్లవీధిలో సత్యసాయిబాబా మందిరం సమీపంలో ఏర్పాటు చేయనున్న శ్రీధ్యానాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా భక్తిశ్రద్ధలతో జలయాత్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మూడు రోజులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాహుదానది వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాహుదానది జలాలను కళశాలతో మహిళలంతా జలయాత్రను ఊరేగింపుగా నిర్వహించారు. అంజనేయస్వామి భక్తులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పనులు చేయకపోతే రోడ్డును దిగ్బంధిస్తాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు



బెండి రోడ్డుపై పోరుయాత్ర చేపడుతున్న సీపీఎం నేతలు, ప్రజా సంఘాలు, గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: బెండిగేటు నుంచి వజ్రపుకొత్తూరు మండల కేంద్రం వరకు ఉన్న ప్రధాన రహదారి నిర్మాణ ప్రారంభించకుంటే రోడ్డును దిగ్బంధిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం బెండిలో ప్రజా సంఘాలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పోరుయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం సీఆర్‌ఎఫ్‌ఐ నిధులు నుంచి మూడేళ్ల క్రితం రూ.30 కోట్లు మంజూరు చేయగా నిర్మాణం చేపట్టకుండా కాలయాపన చేయడం తగదన్నారు. రోడ్డు పనులు నిలిచిపోవడం, ఉన్న రోడ్డు తవ్వేయడం వల్ల మూడేళ్లుగా ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆ నిధులు వెచ్చించి పనులు చేయించడంలో విఫలమైయ్యారని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటున్న ప్రభుత్వం నిధులు ఎందుకు విడుదల చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రహదారిని తవ్వేయడం వల్ల ధూళీ, దుమ్మూ రేగి ప్రజలు వ్యాధుల బారిన పడడమే కాకుండా, తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. బెండి రోడ్డు అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదా అనిప్రశ్నించారు. పోరుయాత్రలో సీఐటీయూ నేతలు ఎన్. గణపతి, రైతు సంఘం నాయకులు కోనారి హేమసూధనరావు, బాలాజీ, టి.భాస్కరరావు, కార్మిక సంఘం నేతలు కె.వెంకటరావు, బి.ధరరావు, బి.శంకర్, డీవైఎఫ్ఐ నాయకులు కె.మహేష్, ఎం.రమేష్, డి.హరిక్రిష్ణ, శేఖర్, హెచ్.బాలక్రిష్ణ, చిన్నారావు, తారకేశ్వరరావు ఉన్నారు.

నిషేధం ఉన్నా ఆగడం లేదు..!

- ఇచ్ఛాపురంలో యథేచ్ఛగా నీటి ప్యాకెట్ల తయారీ
- వ్యాధులకు కారణమవుతున్న వైనం



ఇచ్ఛాపురంలో వాటర్ ప్యాకెట్లు తయారు చేసే ఓ ప్లాంట్



సరఫరాకు సిద్ధంగా ఉన్న వాటర్ ప్యాకెట్ల బస్తాలు

ఇచ్ఛాపురం టౌన్: తాగేనీరు పరిశుభ్రంగా లేకపాతే వ్యాధుల బారిన పడతాం. ఈ విషయం అందరికీ తెలిసిందే. వైద్యులు సైతం ఇదే విషయాన్ని చెబుతుంటారు. ప్యాకెట్లలో ఉండే నీటిని తాగవద్దని సూచిస్తుంటారు. రోజుల తరబడి ప్యాకెట్లలో ఉండే నీటిని తాగడం వల్ల డయేరియా, గొంతునొప్పి, డిహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితులు తలెత్తకుండా ఇచ్ఛాపురం మున్సిపల్ అధికారులు ముందుగానే మేల్గొని వాటర్ ప్యాకెట్ల తయారీ, విక్రయాలపై నిషేధం విధించారు. అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. వాటర్ ప్యాకెట్లతో వ్యాపారం కొనసాగుతూనే ఉంది. చాలామంది చిల్లర వ్యాపారులు నీటి ప్యాకెట్లను విక్రయించడం మానేశారు. అయితే తయారీదారులు మాత్రం వెనక్కితగ్గడం లేదు. వీటి తయారీ ప్లాంటు నిర్వాహకులు మాత్రం యథావిధిగా ప్యాకెట్లపై ఎలాంటి వివరాలు, కనీసం తేదీ లేకుండా వందల సంఖ్యలో తయారు చేస్తూ ఫంక్షన్లకు, గ్రామదేవత ఉత్సవాలకు, సంబరాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నీటినే తాగుతూ చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఖాళీ ప్యాకెట్లను కాలువలు, రోడ్లపై వేయడం వల్ల పారిశుద్ధ్యం క్షీణించి దోమలు, ఈగలు సైతం విజృంభిస్తున్నాయి.

వాటర్ ప్యాకెట్ల తయారీని నిలుపుదల చేయాలని చాలాసార్లు ఇచ్ఛాపురంలో ఉన్న ప్లాంట్ యజమానులను ఆదేశించినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. అయినప్పటికీ వారిలో మార్పులేదన్నారు.

చర్యలు తీసుకుంటాం



ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో వాటర్ ప్యాకెట్ల అమ్మకాలు నిషేధించాం. వీటి తయారీని కూడా నిలిపి వేయాలని సంబంధిత ప్లాంట్ నిర్వహకులను ఆదేశించాం. మరోసారి తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.
– ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్

ప్యాకెట్ నీటితో ఇబ్బందే..



ఎక్కువకాలం నిల్వ ఉన్న ప్యాకెట్‌లోని నీటిని తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. పరిశుభ్రమైన నీరు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. అత్యవసర సమయంలో వాటర్ ప్యాకెట్ల ఉన్న తేదీ చూసుకున్న తరువాతే ఆ నీటిని తాగాలి.
–డాక్టర్ జూహితా, అర్బన్ హెల్త్‌సెంటర్, పురుషోత్తపురం